క్లుప్తంగా

నేడు వీరభద్రుడి కల్యాణం



ఏటూరునాగారం : ఈనెల 14న (శనివారం) మండల కేంద్రంలోని శ్రీ అభినవ వీరభద్ర స్వామి ఆలయంలో వీరభద్రస్వామి, శ్రీభద్రకాళీ అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు బల్ల భద్రయ్య తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఆలయంలో శుక్రవారం పచ్చటి పందిరి వేశారు. పాలపారక అలంకరించారు. సాయంత్రం వినాయకుడి పూజ, రాత్రి ఎదురుకోల్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు భద్రయ్య మాట్లాడారు. శనివారం ఉదయం 6 గంటలకు అభిషేకాలు, అర్చనలు, 11.30లకు మహానివేదన, మత్రపుష్పం, మధ్యాహ్నం 1.32 గంటలకు శ్రీఅభినవ వీరభద్రస్వామి శ్రీభద్రకాళి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం మహా అన్నదానం, సాయంత్రం 6.30లకు కుంకుమార్చన, ఒడిబియ్యం సమర్పన ఉంటాయని చెప్పారు. 15న స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రత్నాకర్, నాగేశ్వర్‌రావు, ఆనంద్, సాంబయ్య, ప్రవీణ్, ప్రసాద్, కిరణ్, రంజిత్ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

మంగపేట : మండల కేంద్రానికి చెందిన సత్తయ్య (78) తన ఇంట్లోని దూలానికి గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తాహెర్‌బాబా తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సత్తయ్య భార్య రెండేళ్ల క్రితం చనిపోగా ఆయన ఒంటరిగా ఉంటున్నాడు. మృతుడి కొడుకు గోపీ సాయంత్రం భోజనం తీసుకురాగా సత్తయ్య ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. కాగా మృతుడి కొడుకు గోపీ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'ఏఎన్‌ఎంలపై చర్యలు తీసుకోవాలి'

వెంకటాపురం (ఎం) : మండలానికి చెందిన ఏఎన్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధికార ప్రతినిధి మెట్టు సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. మండలంలోని తొర్రి చింతలపాడు గొత్తికోయగూడెంకు చెందిన సోమక్క ప్రసవ వేదన పడుతుండగా ఆమెను సబ్ సెంటర్‌కు తీసుకురావాలంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఏఎన్‌ఎంలపై ఆరోపణలు చేశారు. ఏఎన్‌ఎంలు సమయపాలన పాటించడం లేదని, ఇష్టారీతిన విధులు నిర్వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఏఎన్‌ఎంల నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

పరామర్శ



ములుగు రూరల్ (గోవిందరావుపేట) : గోవిందరావుపేట మండలంలోని రాంనగర్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు జన్ను రాందాస్ అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబాన్ని జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి క్వింటా బియ్యంతోపాటు రూ.8,500లు సాయం అందించారు. రాందాస్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన కుటుంబాన్ని జడ్పీటీసీ తుమ్మల హరిబాబు పరామర్శించారు. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం, రూ.8500 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో లకావత్ నర్సింహ, సూడి లక్ష్మారెడ్డి, పృథ్వీరాజ్, మోహన్ రాథోడ్, వాణి రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

టేకుమట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చందర్‌కు చెందిన పూరి గుడిసెలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో గుడిసె పూర్తిగా దగ్ధం కాగా ఇంట్లోని టీవీ, బియ్యం, ఇతర సామగ్రి కాలిపోయి సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రభుత్వం, అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తహసీల్దార్ రామారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయం కింద రూ.5 వేల నగదుతోపాటు బియ్యాన్ని అందజేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపి సాయం అందేలా చూస్తానని బాధిత కుటుంబానికి తహసీల్దార్ భరోసా ఇచ్చారు.

'ఐలాపూర్ సమ్మక్క-సారక్క'పై వివక్ష

- ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క
- వనదేవతలకు పూజలు



కన్నాయిగూడెం : ఐలాపూర్ సమ్మక్క సారక్కలకు మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క

కన్నాయిగూడెం : ఏజెన్సీ ప్రాంతమైన కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లో జరిగే సమ్మక్క సారక్క జాతర పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష పాటిస్తోందని ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క విమర్శించారు. మండలంలోని ఐలాపూర్ వనదేవతల గద్దెలను శుక్రవారం ఆమె దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనేక ఏండ్లుగా జాతర జరుగుతున్నా భక్తుల కోసం తాగునీటి, ఇతర వసతులు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. ఆలయానికి ప్రహరీ నిర్మించాలని, గ్రామం నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు వేయాలని కోరారు. తాగునీటి, ఇతర మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు ఐలాపూర్‌లో సమ్మక్క సారక్క జాతర జరగనున్న క్రమంలో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలోని పేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు.

నిధులు మంజూరు చేయించాలని వినతి

ఐలాపూర్ సమ్మక్క సారక్క జాతర నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయించాలని కోరుతూ పూజారుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సీతక్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పూజారులు సమస్యలను సీతక్కకు వివరించారు. మండలంలోని సర్వాయి నుంచి ఐలాపూర్‌కు సారక్కను అడవి మార్గాన తీసుకొస్తారని తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు, ఆలయ నిర్మాణానికి నిధులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అఫ్సర్ పాషా, సీనియర్ నాయకులు జాడి రాంబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సునార్కని రాంబాబు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బు రమేశ్, చిట్యాల అరుణ్, సుమన్, కాంగ్రెస్ పార్టీ ఐలాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పీరీల భాస్కర్, సురేశ్, నగేశ్, గుడ్ల దేవేందర్ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాతలు సమ్మక్క-సారలమ్మ

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క-సారలమ్మలను స్ఫూర్తిప్రదాతలుగా ఎమ్మెల్యే సీతక్క అభివర్ణించారు. తాడ్వాయి సర్పంచ్ సునీల్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు లచ్చు పటేల్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేడారం వనదేవతల గద్దెల వద్ద సీతక్క ఆవిష్కరించారు. తొలుత కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వనదేవతల సందర్శనకు రాగా వారితో సీతక్క మాట్లాడారు. మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రజల కోసం చేసిన పోరాటాన్ని అధ్యయనం చేయాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ములుగు : వెంకటాపురం మండలానికి చెందిన నలుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సీతక్క పంపిణీ చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్, మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవంత్‌యాదవ్, సర్పంచ్ అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ములుగు : చెక్కులు పంపిణీ చేస్తున్న సీతక్క

ములుగు రూరల్ (గోవిందరావుపేట) : గోవిందరావుపేట మండలానికి చెందిన అజ్మీర శారద, నేరేళ్ల రూప, పాలడుగు సామ్రాజ్యం, సంపత్‌రెడ్డిలకు ఆ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సీతక్క పంపిణీ చేశారు. పేదలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీతారాంనాయక్, దాసరి సుధాకర్, శ్రీకాంత్, ప్రభాకర్, సారయ్య, నాగేందర్‌రావు, ఏడుకొండలు, వెంకటకృష్ణ, భూక్య రాజు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో పేదలకు లబ్ధి



మాట్లాడుతున్న జెడ్పీ కోఆప్షన్ మెంబర్ వలీయాబీ



చెల్పాకలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఏటూరునాగారం : ఈనెల 18 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'కంటి వెలుగు' కార్యక్రమంతో పేదలకు లబ్ధి చేకూరనుందని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ, సర్పంచ్ రామ్మూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడానికి శిబిరాలను ఏర్పాటు చేయనుందని చెప్పారు. ప్రజలు అంధత్వం, ఇతర నేత్ర సంబంధిత సమస్యలపై అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరం ఉన్న ప్రజలు ఆధార్, రేషన్ కార్డులతోపాటు ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకొస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులతోపాటు అవసరమైతే కళ్లద్దాలు అందిస్తారని తెలిపారు. నిష్ణాతులైన వైద్య నిపుణులు కంప్యూటరైజ్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుడ్ల శ్రీలత, ఉపసర్పంచ్ కర్ల అరుణ, వార్డు సభ్యులు, జీపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

చెల్పాకలో..

మండలంలోని చెల్పాక గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు సర్పంచ్ సుమతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డాక్టర్ మంకిడి వెంకటేశ్వర్లు హజరై మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని మారుమూల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని చెప్పారు. శస్త్రచికిత్స అవసరమైతే రెఫర్ చేస్తారని తెలిపారు. తొలుత కంటి వెలుగు కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యురాలు సుమలత, సీహెచ్‌ఓ శారద, పంచాయతీ కార్యదర్శి సందీప్, హెల్త్ అసిస్టెంట్ వనిత, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్తలు సుమలత, స్వప్న, జయ పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకే 'కల్యాణలక్ష్మి'



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు

ఏటూరునాగారం : పేదలను ఆదుకునేందుకే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ అంతటి విజయ, సర్పంచ్ రామ్మూర్తి, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయా బీ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఏడుగురు లబ్ధిదారులకు శుక్రవారం వారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ, ఆర్‌ఐలు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

వాజేడు : యువత సన్మార్గంలో పయనించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని ఇప్పగూడెం, గుమ్మడిదొడ్డి, సుందరయ్య కాలనీకి చెందిన యువతకు గుమ్మడిదొడ్డిలో సర్పంచ్ పాయం జయలక్ష్మితో కలిసి ఆయన శుక్రవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడారు. యువతను దేశానికి వెన్నుముకగా అభివర్ణించారు. యువత సన్మార్గంలో పయనించాలని కోరారు. క్రీడల పట్ల దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని సొంతూరి, తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు జానకిరమణ, లక్ష్మీనారాయణ, ఏసుబాబు, శ్రీనివాస్, సంతోశ్, గణపతి, ప్రకాశ్, సాంబశివరావు పాల్గొన్నారు.

'వేదామృతం' పై వ్యాఖ్యలు అవివేకం



నిరసన తెలుపుతున్న కల్లు, గీత కార్మికులు

ములుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నీరా కల్లుకు పెట్టిన వేదామృతం పేరు పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలని బ్రాహ్మణ సంఘాలు వ్యాఖ్యలు చేయడం అవివేకమని కల్లు, గత కార్మిక సంఘం నాయకుడు రవిగౌడ్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అబ్బాపురంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడారు. కల్లును ప్రకృతి పానీయంగా చెప్పారు. నీరా కల్లుకు వేదామృతం అని పేరు పెడితే బ్రాహ్మణులకు కించపర్చడం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రాచీన కాలంలో వేదాలను తాటి కమ్మలపై రాశారని గుర్తు చేశారు. వైన్ షాపులకు దేవతల పేర్లు పెడుతున్నప్పుడు బ్రాహ్మణ సంఘాలు ఎటుపోయాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం సంతోశ్, శ్రీహరి, జనార్దన్, శివశంకర్, ప్రకాశ్, మధూకర్, కిషన్, మొగిలి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 'చేతి వాటం'పై విచారణ

- కలెక్టర్‌కు నివేదిక ఇస్తా : తహసీల్దార్

సాక్షి స్పందన



మంగపేట : విచారణ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మంగపేట : మండలంలోని కత్తిగూడెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అదనపు రుసుము వసూలు చేయడంపై 'సాక్షి' ప్రచురించిన కథనానికి జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య స్పందించారు. గ్రామంలోని రైతు వేదికలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ కుమారస్వామి శుక్రవారం విచారణ చేపట్టారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులను విచారించారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 వేలు చొప్పున తీసుకున్నట్టు రైతులు తెలపగా, ప్రభుత్వ రుసుము రూ.1,056తోపాటు అఫిడవిట్ ఛార్జీ కలిపి రూ.2 వేలు చొప్పున 40 మంది నుంచి తీసుకున్నట్టు మీ సేవా కేంద్ర నిర్వాహకుడు కిశోర్ వివరణ ఇచ్చాడు. అదనంగా తీసుకున్న డబ్బులు వెంటనే రైతులకు తిరిగి ఇచ్చేయాలని కిశోర్‌ను తహసీల్దార్ ఆదేశించారు. రైతుల నుంచి వాంగ్మూలం తీసుకున్నామని, విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు.

గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం

వెంకటాపురం (ఎం) : మండలంలోని తొర్రి చింతలపాడు గొత్తికోయగూడెంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 'తల్లి గర్భంలోనే శిశువు మృతి' శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ అల్లెం అప్పయ్య స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వైద్యులు, సిబ్బంది గొత్తికోయగూడేనికి చేరుకుని 55 మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. నలుగురు పిల్లలకు టీకాలు వేశారు. ఇద్దరు గర్భిణులను పరీక్షించి ప్రసూతి నేపథ్యంలో అవసరమైన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, అనిత, సీహెచ్‌ఓ సదానందం, శోభ, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, హెల్త్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు స్వప్న, కనకలక్ష్మి, ఆశాకార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, శోభ, కవిత, సంపూర్ణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం (ఎం) : శిశువుకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

వెంకటాపురం (ఎం) : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని పాపయ్యపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సంస్కృతి, సాంప్రదాయాలతో పండుగ చేసుకోవాలని సూచించారు. మొదటి బహుమతిని ఇజిగిరి కల్పన, ద్వితీయ బహుమతిని నాలికే అంజలి, తృతీయ బహుమతిని ధరంసోతు భానుశ్రీ గెల్చుకోగా సర్పంచ్ మండల లక్ష్మి, ఎంపీటీసీ గోపు స్వప్న వాసుదేవరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్ లాల్, ములుగు అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ కన్వీనర్ సిరికొండ బలరాం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్, నాయకులు ప్రేమ్‌సింగ్, బోడ నరేశ్, ఎలకంటి రాజు, కాసర్ల సురేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ములుగు : మండలంలోని అన్నంపల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ పెద్దలు శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజు నాలుగు టీములు తలపడ్డాయి. విజేతలకు సంక్రాంతి పండుగ నాడు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోరిక రమేశ్, గోపీ, దేవేందర్, యువజన సంఘం సభ్యులు పాడె చంటి, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

భూపాలపల్లి రూరల్ : బాలిక అదృశ్యమైన ఘటన మండలంలోని దూదేకులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్, బాలిక కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక(17) ఈనెల 11న పొలం పనులకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల, తెలిసిన వాళ్ల ఇళ్లలో వెతికినా అచూకీ లభించకపోవడంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ మీడియాకు వెల్లడించారు.

పిల్లలతో పని చేయిస్తే చర్యలు



సరుకులు అందజేసి మాట్లాడుతున్న సునీల్

మల్హర్ : పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు తప్పవని చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ సునీల్ తెలిపారు. మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన నిరుపేద కుటంబానికి చెందిన స్వప్న, సాయి, అర్జయ్య కుటుంబంలోని పిల్లలకు న్యూట్రిషియన్ ఆహారానికి సంబంధించిన సరుకులను సునీల్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను పనికి పంపించవద్దని, ప్రతీ రోజు పాఠశాలకు వెళ్లేలా చూడాలని వెల్లడించారు. పనులకు పంపిన వారిని, పని చేయించిన వారిని బాలకార్మికుల చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను ఇబ్బంది పెడితే 1098కు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేశ్, చైల్డ్‌లైన్ మెంబర్ సుప్రియ పాల్గొన్నారు.

'సెంట్రల్ లైటింగ్' పనిచేయక అంధకారం



వెలగని సెంట్రల్ లైటింగ్ సిస్టమ్

కాటారం : మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పని చేయక కొద్ది రోజులుగా అంధకారం నెలకొంది. ప్రయాణికులు, వాహనదారులు, మండల కేంద్రానికి వచ్చే ప్రజలు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలి చీకటిమయంతో నెలకొన్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. నిర్వహణ జాప్యంతోనే సెంట్రల్ లైటింగ్ సిస్టం సక్రమంగా పని చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన కూడలిలో వెలుగులు నెలకొనేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహదేవపూర్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దేవరావుతోపాటు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

చిట్యాల : పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని మండల ప్రత్యేక అధికారి శైలజ అన్నారు. మండలంలోని జూకల్‌లోని 3వ, 5వ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం తనిఖీ చేసి మాట్లాడారు. రిజిస్టర్లు నిర్వహించాలని, మెనూ పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు భోజనాన్ని వినియోగించుకోవాలని కోరారు. కేంద్రంలోనే భోజనం చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీ టీచర్లు కీలకమని చెప్పారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కరుణ, రజిత, సరిత, అరుణ పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో బీజేపీ బూత్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు మీడియాకు వివరాలు వెల్లడించారు. 85వ బూత్ అధ్యక్షుడిగా జూన్నాల వివేక్, ఉపాధ్యక్షులుగా కుసుంబ లక్ష్మణ్, మెరుగు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా నల్లబెల్లి రాజు, కార్యదర్శిలుగా రాధాకృష్ణ, గురజాల శివాజీలను ఎన్నుకున్నట్లు వివరించారు. అలాగే సభ్యులుగా నాగరాజు, కర్నాజీ, అనిల్, రామకృష్ణ, శంకరాచారి, శ్రీనివాస్, చందు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా కొడగాని రాజులను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రావుల రాకేశ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాయిని శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు గోవర్ధన్, తోట్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274